హైకోర్టులో ఉద్యోగం చేస్తున్నాను. ప్రమోషన్ కోసం ఎల్ఎల్బీ చేయాలనుకుంటున్నాను. ఈ కోర్సును దూరవిద్యలో కూడా చదవొచ్చా?

- ఎన్.పూర్ణచంద్రరావు

దూరవిద్యలో ఎల్ఎల్బీ?

■ ఎల్ఎల్బీ కోర్సును దూరవిద్యలో చదివే అవకాశం లేదు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం ఎల్ఎల్బీ కోర్సును రెగ్యులర్ పద్ధతిలోనే చదవాల్సివుంటుంది. ఏ నకిలీ విద్యాసంస్థ అయినా న్యాయవిద్యను దూరవిద్య విధానంలో అందిస్తామని చెబితే నమ్మి మోసపోకండి. మెడిసిన్, ఇంజినీరింగ్, ఎల్ఎల్బీ లాంటి ప్రొఫెషనల్ కోర్సులను వేటినీ దూరవిద్యలో అందించరు. ఒకవేళ ఎవరైనా అలాంటి కోర్సుల్లో చేరితే, ఆ కోర్సులకు ప్రభుత్వ గుర్తింపు ఉండదనే విషయాన్ని దృష్టిలో పెట్టుకోండి. - ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

అమెరికాలో... అడ్వాన్స్‌డ్ కోర్సులివీ!

అమెరికాలో లభిస్తున్న ఉన్నత విద్యావకాశాల గురించి... ఫీజులు, వసతి, ఇతర ఏర్పాట్ల గురించి ఇప్పటికే తెలుసుకున్నాం. మరి ఇప్పుడు అక్కడ లభించే వివిధ రకాల అడ్వాన్స్‌డ్ కోర్సులు, సబ్జెక్టుల తీరుతెన్నులు, లభించే ఉద్యోగాలు - జీతభత్యాలు... వీటన్నింటి గురించి వివరంగా తెలుసుకుందామా!

ఒక కోర్సు గురించి మనం ఆలోచిస్తున్నాం అంటే... దాని ద్వారా వెళ్లే కెరియర్ మార్గం ఎలా ఉంటుందో కూడా తప్పకుండా తెలుసుకోవాలి. ముఖ్యంగా పీజీ స్థాయిలో విద్యార్థులు ఎంచుకునే స్పెషలైజేషన్లపైనే వారి ఉద్యోగ జీవితం ఆధారపడి ఉంటుంది. అమెరికా వెళ్లాలని ఆశిస్తున్న విద్యార్థుల్లో అధికశాతం మంది ఎంచుకుంటున్నది... కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, డేటా అనలిటిక్స్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్, బిజినెస్ అనలిటిక్స్, గేమ్ డిజైన్, ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ ఇంజినీరింగ్, ఇతర అన్ని ఇంజినీరింగ్ విభాగాలు, హెల్త్ ఇన్ఫర్మేటిక్స్, పబ్లిక్ హెల్త్ అండ్ ఫార్మకాలజీ కోర్సులనే! అందుకే దీనికి తగినట్టుగా మనం కూడా వీటిలో ముఖ్యమైన కోర్సుల పూర్తివివరాలను ఇప్పుడు చూద్దాం.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

▲ ఇప్పుడు మనం వాడుతోన్న చాలా సాంకేతిక ఉపకరణాల్లో ఏఐను ఉపయోగిస్తూ ఉండటం వల్ల రానున్న కాలంలో టెక్నాలజీ పరిశ్రమలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రముఖ పాత్ర పోషించనుంది.

▲ ఇందులో పీజీ చేసిన విద్యార్థులు థియరిటికల్ ఫౌండేషన్స్, అల్గారిథమ్ డెవలప్‌మెంట్ వంటి విషయాలపై బలమైన పట్టు సంపాదిస్తారు. వివిధ రకాలైన ఇంజినీరింగ్ అప్లికేషన్లపై లోతుగా అధ్యయనం చేస్తారు. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ నైపుణ్యాలను కలగలిపి నేర్చుకుంటారు.

▲ అమెరికాలోని చాలా విశ్వవిద్యాలయాల్లో ఏఐ కోర్సులో మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, అల్గారిథమ్స్, డేటా అనలిటిక్స్, డేటా మైనింగ్, ఇమేజ్ ప్రాసెసింగ్, కంప్యూటర్ విజన్, ఎంబెడెడ్ సిస్టమ్స్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్, కమ్యూనికేషన్ నెట్‌వర్క్స్ వంటి వివిధ సబ్జెక్టులు నేర్పిస్తారు.

▲ యూనివర్సిటీని బట్టి ఇందులో చిన్నాచితకా మార్పులు ఉండొచ్చు. కానీ ప్రాథమికంగా నేర్పించే అంశాలు మాత్రం పైన చెప్పిన విధంగానే ఉంటాయి. ఏఐని ఉపయోగించే అప్లికేషన్లను బట్టి స్పెషలైజేషన్లు ఆధారపడి ఉంటాయి.

▲ ఏఐలో మాస్టర్స్ డిగ్రీ ఉన్న విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంజినీర్, డేటా ఇంజినీర్, డేటా సైంటిస్ట్, మెషిన్ లెర్నింగ్ ఇంజినీర్, ఆర్‌అండ్‌డీ ఇంజినీర్, ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్స్ అనలిస్ట్ వంటి వివిధ ఉద్యోగాలను ఎంచుకోవచ్చు.

▲ ఈ కోర్సు చేసి ఉద్యోగం పొందిన అభ్యర్థులకు ఏడాదికి దాదాపు రూ.80 లక్షల వరకూ జీతం లభిస్తుంది. ఇందులో అత్యధికంగా రూ.కోటిన్నర తీసుకునేవారూ ఉన్నారు.

▲ ఇందులో చేరదలిచేవారు విశ్లేషణాత్మక (అనలిటికల్), కోడింగ్ నైపుణ్యాలు మెరుగుపరుచుకోవడంపై దృష్టి సారించాలి.

బయోమెడికల్ ఇంజినీరింగ్

▲ బయోమెడికల్ ఇంజినీర్లు టెక్నాలజీ అభివృద్ధి, మెడిసిన్‌లో నూతన విధానాల కోసం, మనుషుల ఆరోగ్య సంరక్షక పరికరాల తయారీకి పాటుపడతారు. హెల్త్ కేర్ ఇండస్ట్రీలో సమస్యల పరిష్కారానికి నైపుణ్యాలను వినియోగిస్తారు.

▲ ఈ కోర్సులో భాగంగా విద్యార్థులు బయోమెకానిక్స్, బయోమెటీరియల్ అండ్ టిష్యూ ఇంజినీరింగ్, బయోమెడికల్ ఇమేజింగ్, రోబోటిక్స్ అండ్ కంట్రోల్ ఆఫ్ బయోలాజికల్ సిస్టమ్స్, న్యూరల్ ఇంజినీరింగ్, బయో ఇన్ఫర్మేటిక్స్, మెషిన్ లెర్నింగ్ సబ్జెక్టులు నేర్చుకుంటారు.

▲ ఇది స్టెమ్ కోర్సుల్లో భాగం కావడంతో విద్యాభ్యాసం తర్వాత అభ్యర్థికి మూడేళ్ల పనిచేసేందుకు అనుమతి లభిస్తుంది.

▲ ఈ కోర్సు పూర్తిచేసిన వారికి బయోమెటీరియల్ డెవలపర్, రిహాబిలిటేషన్ ఇంజినీర్, మెడికల్ టెక్నాలజీ డెవలపర్, అనలిస్ట్, మెడికల్ రిసెర్చర్, క్లినికల్ ఇంజినీర్ వంటి పోస్టులు దక్కుతాయి. ఏడాదికి సగటున రూ.50 లక్షల నుంచి రూ.95 లక్షల వరకూ జీతం లభిస్తుంది.

డేటాసైన్స్

« డొమైన్ అనుభవం, ప్రోగామింగ్ నైపుణ్యాలు, గణితం, గణాంకాలను ఉపయోగిస్తూ డేటాను అధ్యయనం చేసే విభాగమిది. డేటా సైన్స్ నిపుణులు అంకెలు, టెక్స్ట్, చిత్రాలు, వీడియో, ఆడియో.. వంటి వాటి ద్వారా మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్స్ వినియోగించి ఆర్టిఫిషియల్ సిస్టమ్స్ తయారుచేస్తారు. తద్వారా మనుషులు చేసే పనులను మెషీన్లతో చేయించగలరు. ప్రస్తుతం ఇది మార్కెట్లో చాలా విలువైన వ్యాపారం.

« డేటా నుంచి అవసరమైన సమాధానాలు రాబట్టేందుకు డేటా సైన్స్ వివిధ రకాల టూల్స్, పద్ధతులు, టెక్నాలజీని ఉపయోగిస్తుంది. ప్రస్తుత వ్యాపార రంగాల్లో సమాచారం చాలా ఎక్కువ. ఈ-కామర్స్, మెడిసిన్, ఫైనాన్స్ వంటి చాలా రంగాల్లో ఆన్‌లైన్ సిస్టమ్స్, పేమెంట్ పోర్టల్స్ వినియోగదారుడి సమాచారాన్ని టెక్స్ట్స్, ఆడియో, వీడియో, చిత్రాలుగా సేకరిస్తున్నాయి. ఆ డేటాను తిరిగి లాభదాయకమైన విధానంలో ఉపయోగించాలంటే.. అందుకు డేటా సైన్స్ సహాయం కావాలి.

« డేటా సైన్స్‌లో భాగంగా కంప్యూటింగ్ థియరీ, అడ్వాన్స్‌డ్ డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా విజువలైజేషన్, డేటా మైనింగ్, స్టాటిస్టిక్స్, ఎస్‌క్యూఎల్, ఎస్ఏఎస్, పైతాన్ వంటి ప్రోగామింగ్ లాంగ్వేజ్‌లు నేర్చుకుంటారు.

« ఇందులో పట్టా పుచ్చుకున్న అభ్యర్థులు డేటా అనలిస్ట్, బిజినెస్ అనలిస్ట్, డేటా అనలిస్ట్ మేనేజర్, డేటా ఆర్కిటెక్ట్, డేటా అడ్మినిస్ట్రేటర్, బిజినెస్ ఇంటెలిజెన్స్ మేనేజర్, డేటా క్వాలిటీ అనలిస్ట్ వంటి ఉద్యోగాల్లోకి వెళ్లగలరు.

« డేటా సైన్స్‌లో ఉద్యోగం పొందిన అభ్యర్థి జీతం సగటున రూ.75 లక్షల నుంచి రూ. కోటిన్నర వరకూ ఉంటుంది. డేటా ఇంజినీర్లకు డిమాండ్ రానురానూ పెరుగుతోంది.

బిజినెస్ అనలిటిక్స్

« వ్యాపారాభివృద్ధిలో సమాచారాన్ని విశ్లేషించడం చాలా ముఖ్యం. డేటా, స్టాటిస్టికల్ అనాలిసిస్ వంటివి వ్యాపారాన్ని అంచనా వేయడానికి, కావాల్సిన సూచనలు ఇవ్వడానికి, అభివృద్ధి బాటలో పయనించేలా తోడ్పాటు అందించడానికి ఉపయోగపడతాయి. బిజినెస్ అనలిటిక్స్‌లో డేటా సేకరణ, డేటా మైనింగ్, సీక్వెన్స్ గుర్తింపు, టెక్స్ట్స్ మైనింగ్, ఫోర్‌కాస్టింగ్, అంచనాలు, ఆప్టిమైజేషన్, డేటా విజువలైజేషన్ వంటివి భాగం.

« చాలా కంపెనీలు తమ నిర్ణయాలను తమవద్దనున్న సమాచారం ఆధారంగానే తీసుకుంటాయి. తద్వారా కంపెనీ అభివృద్ధి అంచనాలకు తగినట్టుగా ఉందా లేదా అనేది చూసుకుంటాయి.

« ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఏ స్ట్రీమ్ విద్యార్థులైనా సరే బిజినెస్ అనలిటిక్స్ చదువుకోవచ్చు. ఇందులో సబ్జెక్ట పరిమితులు లేవు.

« అమెరికాలో లభిస్తున్న బిజినెస్ అనలిటిక్స్ కోర్సులో భాగంగా విద్యార్థులు బిజినెస్ ఇంటెలిజెన్స్, డేటా మైనింగ్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ ఇన్ అనలిటిక్స్, ప్రోగ్రామింగ్ నైపుణ్యాలు, బిగ్ డేటా - బిజినెస్, మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ వంటి సబ్జెక్టులు చదువుకుంటారు. యూనివర్సిటీని బట్టి ఈ సబ్జెక్టుల్లో మార్పులు ఉండవచ్చు.

« ఈ కోర్సు చదివిన అభ్యర్థి బిజినెస్ అనలిస్ట్, డేటా అనలిస్ట్, డేటా సైంటిస్ట్, ప్రోగామ్ మేనేజర్, మార్కెటింగ్ మేనేజర్, మార్కెట్ రిసెర్చ్ అనలిస్ట్, బిగ్ డేటా అనలిస్ట్ వంటి వివిధ పోస్టుల్లో కొలువుదీరవచ్చు. « బిజినెస్ అనలిటిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ ఉన్న అభ్యర్థి జీతం ఏడాదికి సగటున రూ.55 లక్షల నుంచి రూ.కోటీ ఇరవై లక్షల వరకూ ఉంటుంది.

హెల్త్ ఇన్ఫర్మేటిక్స్

▼ హెల్త్ ఇన్ఫర్మేటిక్స్‌ను హెల్త్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ అని కూడా అంటారు. ఇది ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధారంగా పనిచేస్తుంది. ఆరోగ్య రికార్డులను భద్రపరచడం ద్వారా మెరుగైన వైద్యసేవలు అందేలా చేయడం దీని ఉద్దేశం. హెల్త్‌కేర్ అనలిస్ట్ అనేవారు అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని రోగులకు మెరుగైన వైద్యం అందేలా సాయపడతారు. కొవిడ్ విజృంభించిన సమయంలో దీనికి చాలా ప్రాధాన్యం ఏర్పడింది.

▼ ఫార్మాస్యూటికల్ సైన్స్, మెడిసిన్, ఇతర సైన్స్ విభాగాలు చదివిన విద్యార్థులకు ఇది చక్కని కెరియర్ మార్గం. ఏదైనా ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లో ప్రవేశం ఉండటం మరింత ఉపయోగపడుతుంది.

▼ హెల్త్ ఇన్ఫర్మేటిక్స్‌లో హెల్త్ డేటా అనలిటిక్స్ కన్సల్ట్రేషన్, హెల్త్ ఇన్ఫర్మేటిక్స్ మేనేజ్‌మెంట్, పాపులేషన్ హెల్త్ కాన్సల్ట్రేషన్, క్లినికల్ అండ్ బిజినెస్ ఇంటెలిజెన్స్, హెల్త్ కేర్ ఆపరేషన్స్ వంటి స్పెషలైజేషన్లు ఉన్నాయి. విద్యార్థి ఎంచుకున్న విశ్వవిద్యాలయాన్ని అనుసరించి ఇంకా వేరేవి కూడా ఉండవచ్చు.

▼ ఈ పట్టా ఉన్నవారు ఇన్ఫర్మేటిక్స్ అనలిస్ట్, క్లినికల్ ఇన్ఫర్మేటిసిస్ట్, ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డ్ కీపర్, ఇన్ఫర్మేటిక్స్ స్పెషలిస్ట్, చీఫ్ మెడికల్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, హెల్త్ ఇన్ఫర్మేటిక్స్ కన్సల్టెంట్, ఇన్ఫర్మేటిక్స్ డైరెక్టర్ వంటి పోస్టులు పొందవచ్చు. ▼ వీరికి సగటున జీతం ఏడాదికి రూ.59 లక్షల నుంచి రూ.కోటి ముప్ఫై లక్షల వరకూ ఉంటుంది.

పబ్లిక్ హెల్త్

▼ జనాభా, కమ్యూనిటీలు, పర్యావరణ ఆరోగ్యాన్ని కాపాడటం పబ్లిక్ హెల్త్ ప్రధాన లక్ష్యం. ఈ నిపుణులు పాండమిక్స్, ఎపిడెమిక్స్, వైకల్యాలు, వ్యాధులు, ప్రీమెచ్యూర్ జననాలు వంటి వాటిని నిరోధించడానికి పనిచేస్తారు. ఇందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచుకోవడం, వ్యాధులు ప్రబలినప్పుడు ఎదుర్కోవడం, వాటి వేగాన్ని అంచనా వేయడం, ఆరోగ్యకరమైన జీవన విధానాలను ప్రచారం చేయడం వంటివి చేస్తారు. దీనికోసం పరిశోధన, పాలసీ, అవగాహన వంటి మార్గాలను ఉపయోగిస్తారు.

▼ ఇందులో బయోస్టాటిస్టిక్స్, కమ్యూనిటీ హెల్త్ సైన్సెస్, ఎన్విరాన్‌మెంట్ అండ్ ఆక్యుపేషనల్ హెల్త్ సైన్స్, ఎపిడెమియాలజీ, ఇండస్ట్రీ హెల్త్ హైజీన్, ఆక్యుపేషనల్ మెడిసిన్, ఆక్యుపేషనల్ సేఫ్టీ వంటి స్పెషలైజేషన్లు ఉన్నాయి.

▼ కొన్ని యూనివర్సిటీల్లో స్పెషలైజేషన్‌ను బట్టి ఈ కోర్సులను స్టెమ్ కోర్సులుగా గుర్తిస్తారు. ఉదాహరణకు చాలా యూనివర్సిటీల్లో ఎపిడెమియాలజీ స్పెషలైజేషన్‌ను మాస్టర్స్ కోసం ఎంచుకుంటే స్టెమ్ ప్రోగ్రామ్‌గా గుర్తిస్తారు.

▼ పబ్లిక్ హెల్త్ చదువుకున్న వారికి హెల్త్ కేర్ అడ్మినిస్ట్రేటర్స్, ఎపిడెమియాలజిస్ట్, సోషల్ అండ్ కమ్యూనిటీ సర్వీస్ మేనేజర్స్, మెంటల్ హెల్త్ కౌన్సెలర్స్, మెడికల్ రికార్డ్స్ అండ్ హెల్త్ ఇన్ఫర్మేటిక్స్ టెక్నీషియన్ వంటి పోస్టులు దొరుకుతాయి. వీరికి ఏడాదికి రూ.45 లక్షల నుంచి రూ.కోటి వరకూ వేతనం లభిస్తుంది.

– శుభకర్ ఆలపాటి
ఫౌండర్, డైరెక్టర్ గ్లోబల్ బ్రీ

నోటిఫికేషన్స్

ప్రభుత్వ ఉద్యోగాలు

పవన్ హన్స్ కార్గో లాజిస్టిక్స్‌లో...

న్యూదిల్లీలోని ఏఏఐ కార్గో లాజిస్టిక్స్ అండ్ అలైడ్ సర్వీసెస్ కంపెనీ లిమిటెడ్.. మూడేళ్ల కాలవ్యవధికి ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన 400 సెక్యూరిటీ స్క్రీనర్ పోస్టుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
అర్హత: కనీసం 60% మార్కుల(ఎస్సీ/ ఎస్టీ కేటగిరీ అభ్యర్థులకు 55%)తో ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. **వయసు:** 19.03.2023 నాటికి 27 ఏళ్లు మించకూడదు. **దరఖాస్తు రుసుము:** రూ.750 (ఎస్సీ, ఎస్టీ, మహిళా అభ్యర్థులకు ఫీజు మినహాయింపు).
ఎంపిక: రాత పరీక్ష, ఇంటరాక్షన్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 19-03-2023.
వెబ్‌సైట్: https://aaiclas.aero/career

న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్...

డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీకి చెందిన హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్.. 124 పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
★ చీఫ్ ఫైర్ ఆఫీసర్/ ఎ: 01 ★ టెక్నికల్ ఆఫీసర్/ సి (కంప్యూటర్స్): 03 ★ డిప్యూటీ చీఫ్ ఫైర్ ఆఫీసర్/ ఎ: 02 ★ స్టేషన్ ఆఫీసర్/ ఎ: 07 ★ సబ్-ఆఫీసర్/ బి: 28 ★ డ్రైవర్-కమ్-పంప్ ఆపరేటర్-కమ్ ఫైర్‌మ్యాన్/ ఎ: 83
అర్హత: పోస్టును అనుసరించి 10+2, సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్.
ఎంపిక: ఖాళీని అనుసరించి ప్రిలిమినరీ టెస్ట్, అడ్వాన్స్‌డ్ టెస్ట్, ఫిజికల్ అసెస్‌మెంట్ టెస్ట్, కమాండ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ, డ్రైవింగ్ టెస్ట్ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 10.04.2023.
వెబ్‌సైట్: https://www.nfc.gov.in/

హిందుస్థాన్ షిప్‌యార్డ్-వైజాగ్‌లో..

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) 43 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు: మేనేజర్, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్, సీనియర్ అడ్జైజర్, సీనియర్ కన్సల్టెంట్ తదితరాలు.
విభాగాలు: కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్, బిజినెస్ డెవలప్‌మెంట్, లీగల్, టెక్నికల్, ఫైనాన్స్, డిజైన్, సెక్యూరిటీ అండ్ ఫైర్ సర్వీస్..
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో గ్రాడ్యుయేషన్/ ఇంజినీరింగ్ డిగ్రీ/ డిప్లొమా/ ఎంబీబీఎస్/ ఎల్ఎల్బీ/ ఐసీఏఐ/ ఐసీడబ్ల్యూఏఐ/ పీజీ డిగ్రీ/ పీజీ డిప్లొమా/ ఎంబీఏ/ ఎంసీఏ. **వయసు:** 30-62 ఏళ్ల ఉండాలి.
ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.
★ మెడికల్ ఆఫీసర్, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్(లీగల్) పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు మాత్రం 23.03.2023 రోజున ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇతర అభ్యర్థులకు సంస్థ నిబంధనల ప్రకారం ఎంపిక విధానం ఉంటుంది.
ఇంటర్వ్యూ వేదిక: Hindustan Shipyard Limited, Visakhapatnam (ఉదయం 8:30 నుంచి).
దరఖాస్తు ఫీజు: రూ.300. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 06.04.2023. **వెబ్‌సైట్:** https://www.hslvizag.in/content/200_1_careers.aspx

ఎస్సీ, ఎస్టీ హబ్ కార్యాలయాల్లో ఖాళీలు

నేషనల్ ఎస్సీ, ఎస్టీ హబ్ కార్యాలయాల్లో పని చేయటానికి బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) 28 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు: ఈ-టెండరింగ్ ప్రొఫెషనల్, ఫైనాన్స్ ఫెసిలిటేషన్ ప్రొఫెషనల్, ఆఫీస్ అటెండెంట్.
అర్హత: పోస్టును అనుసరించి 10వ తరగతి/ బీటెక్/ బీఈ/ బీకామ్/ ఐసీడబ్ల్యూఏ/ ఎంబీఏ.
ఎంపిక: స్కిల్ టెస్ట్/ రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు ఫీజు: రూ.885.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 24.03.2023.
వెబ్‌సైట్: https://www.becil.com/vacancies

బీఈసీఐఎల్‌లో 73 వివిధ పోస్టులు

గువాహటిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో పని చేయటానికి బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) 73 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు: జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, ల్యాబ్ అటెండెంట్, ల్యాబ్ టెక్నీషియన్, మెడికల్ సోషల్ వర్కర్, మెడికల్ రికార్డ్ టెక్నీషియన్, క్లినికల్ సైకాలజిస్ట్, ఫిజియోథెరపిస్ట్, స్పీచ్ థెరపిస్ట్/ స్పీచ్ అండ్ లాంగ్వేజ్ పాథాలజిస్ట్, ఓపీడీ అటెండెంట్, టెక్నికల్ ఆఫీసర్, అనస్థీషియా టెక్నీషియన్, టెక్నికల్ అసిస్టెంట్, ఆర్థోపెడిక్/ ప్లాస్టర్ టెక్నీషియన్, జూనియర్ ఇంజినీర్ తదితరాలు.
అర్హత: పోస్టును అనుసరించి 10వ తరగతి/ 10+2/ ఇంటర్మీడియట్/ బీఈ/ బీటెక్/ బీఎస్సీ/ గ్రాడ్యుయేషన్/ డిప్లొమా/ డీఎంఎల్‌టీ/ ఎంసీఏ/ ఎంఎస్సీ/ ఎంఏ.
ఎంపిక: స్కిల్ టెస్ట్/ ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 21.03.2023.
వెబ్‌సైట్: https://www.becil.com/vacancies

బీఎస్ఎఫ్‌లో చేరతారా?

1284 కానిస్టేబుల్ ఉద్యోగాలు

దేశ సరిహద్దుల పరిరక్షణే ధ్యేయంగా దశాబ్దాలుగా సేవలందిస్తోంది సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్). తాజాగా వివిధ కానిస్టేబుల్ (ట్రేడ్స్‌మన్) పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. మొత్తం 1284 ఖాళీల్లో పురుషులకు 1220, మహిళలకు 64 కేటాయించారు.

కానిస్టేబుల్ (కోబ్లర్)/ టైలర్/ వాషర్‌మెన్/ బార్బర్/ స్వీపర్/ కుక్/ వాటర్ క్యారియర్/ వెయిటర్... మొదలైన ఖాళీలు ఉన్నాయి. అభ్యర్థులు మెట్రిక్యులేషన్/ పదో తరగతి/ తత్సమాన పరీక్ష పాసవ్వాలి. కొన్ని ట్రేడుల్లో ఎన్ఎస్‌క్యూఎఫ్ లెవల్-1 కోర్సు పూర్తిచేయాలి. అభ్యర్థుల వయసు 18 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి. గరిష్ఠ వయసులో ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 5 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు 3 ఏళ్లు సడలింపు ఉంటుంది.

ఎంపిక

రాత పరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ (పీఎస్‌టీ), ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ (పీఈటీ), డాక్యుమెంటేషన్, ట్రేడ్ టెస్ట్, డీటెయిల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్ (డీఎంఈ) ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. తగిన శారీరక ప్రమాణాలు ఉన్న అభ్యర్థులకు మాత్రమే రాత పరీక్ష నిర్వహిస్తారు.

ఎత్తు: పురుష అభ్యర్థులు 165 సెం.మీ ఎత్తు ఉండాలి. ఛాతీ చుట్టుకొలత 75-80 సెం.మీ. ఉండాలి. మహిళా అభ్యర్థుల ఎత్తు 155 సెం.మీ. ఉండాలి. ఎస్సీ/ఎస్టీకి చెంది పురుష అభ్యర్థుల ఎత్తు 160 సెం.మీ., ఛాతీ 75-80 సెం.మీ ఉండాలి. మహిళా అభ్యర్థులు 148 సెం.మీ. ఉండాలి.

రాత పరీక్ష

ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) లేదా ఓఎంఆర్ విధానంలో ఉంటుంది. 100 మార్కులకు 100 ప్రశ్నలతో ఇంగ్లిష్, హిందీ భాషల్లో ఉంటుంది. పరీక్ష సమయం 2 గంటలు.

✤ ప్రశ్నపత్రం నాలుగు విభాగాలుగా ఉంటుంది. 1) జనరల్ అవేర్‌నెస్/ జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన 25 ప్రశ్నలకు 25 మార్కులు. 2) ఎలిమెంటరీ మేథమెటిక్స్‌కు చెందిన 25 ప్రశ్నలకు 25 మార్కులు. 3) ఎనలిటికల్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించిన 25 ప్రశ్నలకు 25 మార్కులు. 4) ఇంగ్లిష్/ హిందీ భాషలో అభ్యర్థి ప్రాథమిక పరిజ్ఞానాన్ని పరీక్షించే 25 ప్రశ్నలకు 25 మార్కులు ఉంటాయి.
✤ ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటాయి.
✤ రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు రెండో దశలో ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ నిర్వహిస్తారు.
✤ నిర్ణీత ఎత్తు ఉన్న అభ్యర్థులకు మాత్రమే ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ జరుపుతారు. దీంట్లో భాగంగా నిర్వహించే పరుగు పందెంలో పురుష అభ్యర్థులు 5 కిలోమీటర్ల దూరాన్ని 24 నిమిషాల్లో పూర్తిచేయాలి. మహిళా అభ్యర్థులు 1.6 కిలోమీటర్ల దూరాన్ని 8.30 నిమిషాల్లో పూర్తిచేయాలి. దీంట్లో గెలుపొందిన అభ్యర్థులకు డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఉంటుంది.
✤ ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ ఉండదు. పీఈటీ అర్హత పరీక్ష మాత్రమే. దీనికి మార్కులుండవు.

దరఖాస్తు ఫీజు: రూ.100 ఆన్‌లైన్ విధానంలో చెల్లించాలి. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీఎస్ఎఫ్ ఉద్యోగులు, ఎక్స్-సర్వీస్‌మెన్‌కు ఫీజు లేదు.
దరఖాస్తుకు చివరి తేదీ: 27.03.2023
వెబ్‌సైట్: https://rectt.bsf.gov.in/

ట్రేడ్‌టెస్ట్: కానిస్టేబుల్ (కోబ్లర్) / టైలర్/ వాషర్‌మెన్/ బార్బర్/ స్వీపర్‌లకు ట్రేడ్ టెస్ట్ ఉంటుంది. వీరంతా సంబంధిత పనుల్లో నిపుణులై ఉండాలి. కానిస్టేబుల్ (కుక్)/ వాటర్ క్యారియర్/ వెయిటర్‌లకు ట్రేడ్‌టెస్ట్ ఉండదు. ఈ మూడు కేటగిరీలకు చెందిన అభ్యర్థులు నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి ఫుడ్ ప్రొడక్షన్‌లో నేషనల్ స్కిల్స్ క్వాలిఫికేషన్స్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఎస్‌క్యూఎఫ్) లెవెల్-1 కోర్సు పూర్తిచేయాలి. ఈ మూడు దశల్లో పాసైనవారికి వైద్య పరీక్షలు నిర్వహించి తుది జాబితాను రూపొందిస్తారు.

ముఖ్యాంశాలు

✪ ఒకరు ఒక పోస్టుకు మాత్రమే దరఖాస్తు చేయాలి.
✪ అభ్యర్థులు తమకు కేటాయించిన రిజిస్ట్రేషన్ ఐడీ, పాస్‌వర్డ్‌లను రాసుకుని భద్రపరుచుకోవాలి.
✪ ఈ పోస్టులకు దరఖాస్తు చేయడానికి దివ్యాంగులు అనర్హులు.
✪ ఇప్పటికే పనిచేస్తున్న అభ్యర్థులు అప్లికేషన్‌కు 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్'ను జతచేయాలి.
✪ ఎంపికైన అభ్యర్థులకు రేషన్ అలవెన్స్, వైద్య సహాయం, ఉచిత వసతి, ఉచిత లీవ్ పాస్ లాంటి సదుపాయాలన్నీ వర్తిస్తాయి.